క్లుప్తంగా

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ ఉపకేంద్రం 220 కేవీ మరమ్మతుల నిమిత్తం ఆదివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదన్నారు. నగరంలోని గిరింపేట ప్రాంతం మినహాయించి అన్ని ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని చెప్పారు. అదే విధంగా గుడిపాల, చిత్తూరు రూరల్, యాదమరి మండలాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని వివరించారు.

భవిత కేంద్రానికి నగదు విరాళం



నగదు అందజేస్తున్న దాత సుశీల

బంగారుపాళెం: స్థానిక భవిత కేంద్రానికి శనివారం ఓ దాత నగదు విరాళంగా అందజేశారు. భవిత కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో నలగాంపల్లెకు చెందిన సుశీల(సీఆర్‌పీ) ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు సమక్షంలో సహిత విద్యాఉపాధ్యాయురాలు హిమబిందుకు రూ.5 వేలు అందజేశారు. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం తన వంతుగా సాయం అందించినట్లు దాత తెలిపారు.

జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం



భోజనాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బంగారుపాళెం: స్థానిక పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి మాట్లాడుతూ, ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తున్నట్లు వివరించారు. విద్యార్థులు కళాశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు నాగేశ్వర్‌రావు, రమేష్‌బాబు, హెచ్‌ఎం రాజేంద్ర, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఛలో విజయవాడకు పయనం

చిత్తూరు కార్పొరేషన్: ఛలో విజయవాడ కార్యక్రమానికి బీజేపీ చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం, కార్యకర్తలు బయలుదేరారు. చిత్తూరు నుంచి సనాతన ధర్మంపై శనివారం విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి వీరు వెళ్లారు. అందరూ ఐక్యంగా కలిసి సంప్రదాయాలను కాపాడుకోవాలని షణ్ముగం వివరించారు.

విద్యార్థి దశ కీలకం




విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): విద్యార్థి దశ అత్యంత కీలకమని, ఈ దశలోనే ఉన్నత స్థాయికి ఎదిగేందుకు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ అన్నారు. చిత్తూరు మండలం బీఎస్‌ఆర్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. విద్యార్థులకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, నాయకులు చంద్రప్రకాష్, మోహన్‌రాజ్, మేషాక్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: బొమ్మసముద్రం జూనియర్ కళాశాలలో శనివారం మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ శరత్‌చంద్రశేఖర్ ప్రారంభించారు. అనంతరం టీడీపీ సీనియర్ నాయకులు బాలాజీనాయుడు, సుబ్రమణ్యంనాయుడు మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హసన్‌బాషా పాల్గొన్నారు.

హరిహరుల క్షేత్రం మహిమాన్వితం



మొగిలీశ్వర క్షేత్రం

జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం మొగిలి. ఇక్కడ హరిహరులు కొలువై భక్తుల పూజలు అందుకుంటున్నారు. చుట్టూ కొండల మధ్య కనువిందైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో స్వయంభువుగా ముక్కంటి ఇక్కడ వెలిశారు. హరితో కొలువైనందున దీన్ని హరిహరక్షేత్రమని కూడా అంటారు. గోపాలుడు, రుక్మిణీ, సత్యభామ సమేతంగా కొలువై ఉండటం మొగిలి ప్రత్యేకత. వరపడిన మహిళలకు సంతానప్రాప్తి సిద్ధిస్తుంది. సర్పదోష నివారణ కోసం చేసే రాహుకేతు పూజ ఈ ఆలయంలో చేయించుకుంటే మంచి ఫలితాలు ఉంటాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

- నిత్యపూజలు అందుకుంటున్న మొగిలీశ్వరస్వామి
- వరపడితే సంతానప్రాప్తి
- ప్రతి సోమవారం రాహుకేతు పూజలు
- ప్రతి సంవత్సరం బ్రహ్మోత్సవాలు



స్వయంభు శ్రీమొగిలీశ్వరస్వామి

బంగారుపాళెం: మొగిలికి ఆగ్నేయంగా మూడు కిలోమీటర్ల దూరంలో మొగిలివారిపల్లె గ్రామం ఉంది. ఈ గ్రామానికి చెందిన మొగిలప్ప పశువులను మేపుకుంటూ జీవించేవాడు. ప్రస్తుతం ఆలయ పుష్కరిణి ఉండే ప్రాంతంలో మొగిలి పొదలు అధికంగా ఉండేవి. వాటి మధ్య సన్నని నీటి ధార ఉండేది. పశువులు ఈ నీటిని తాగేవని ప్రతీతి. ఒక రోజు నీటిధారకు నల్లరాయి అడ్డు రావడంతో మొగిలప్ప ఆ రాయిని తీసి పక్కనే గట్టుపై పెట్టాడు. అయితే మరుసటి రోజుకి ఆ రాయి యథాస్థానంలో ఉండడంతో మళ్లీ రాయిని తీసి గట్టుపై పెట్టాడు. ప్రతి రోజు రాయిని తీసి గట్టు మీద పెట్టినా తిరిగి తన స్థానానికి చేరుకుంటూ ఉండడంతో ఆగ్రహం చెందిన మొగిలప్ప తన చేతిలో ఉన్న గొడ్డలితో రాతిపై కొట్టాడు. ఆ దెబ్బకు రాతి నుంచి రక్తం కారడంతో భయాందోళనకు లోనై ఆకుపసరుతో రక్తం రాకుండా కట్టుకట్టాడు. దీంతో మొగిలప్పకు శివుడు ప్రత్యక్షమై తానే లింగరూపంలో ఇక్కడ ఉన్నట్టు చెప్పాడు. అప్పటి నుంచి ఆ లింగాన్ని గట్టుమీద ఉంచి ఆలయాన్ని నిర్మించి పూజలు చేస్తున్నారని స్థల పురాణం చెబుతోంది.

భక్తుల్లో ప్రత్యేక అనుభూతి

ఆలయం విశాలమైన ఆవరణలో రంగమండపం, ముఖమండపం, అంతరాళమండపం, గర్భగుడితో అలారారుతూ భక్తులకు పరవశింప చేస్తోంది.



శ్రీకామాక్షమ్మ

గర్భాలయంలో శివుడు సర్వాలంకార భూషితుడై దర్శనమిస్తాడు. స్వయంభు శివలింగ దర్శనం భక్తులలో ప్రత్యేక అనుభూతిని కలిగిస్తోంది. స్వామివారి గర్భాలయానికి ఎడమవైపున శ్రీస్వామివారి దేవేరి సంతాన ప్రదాయనిగా పేరొందిన శ్రీకామాక్షిదేవి గర్భాలయం ఉంది. ఆలయం ఆవరణలోని రంగమండపం, ప్రదక్షిణ మండపాల్లో అనేక మంది దేవతల కళాకృతులు కొలువై ఉన్నాయి. కాశీ విశ్వేశరుడు, విశాలాక్షి, సూర్యభగవానుడు, కాలభైరవుడు, దుర్గాదేవి, బ్రహ్మదేవుడు, కుమార స్వామి, దక్షిణామూర్తి, శ్రీరామలింగేశ్వరుడు, వీరభద్రస్వామి, శ్రీగోపాలుడు, రుక్మిణీదేవి, సత్యభామ, సప్తమాతకలు మొదలైన వారు ఈ మండపాల్లో ఉన్నారు. ఈ దేవతలతో పాటు శ్రీమొగిలీశ్వరస్వామిని సేవించినట్లు మహాభక్తులైన మొగిలప్ప, మొగిలమ్మ విగ్రహాలు ఉన్నాయి.

అతి ప్రాచీన ఆలయం

చారిత్రకంగా పరిశీలిస్తే, శ్రీకాళహస్తి ఆలయం కంటే మొగిలి శివాలయం అతిప్రాచీనమైనదిగా తెలుస్తోంది. క్రీస్తుశకం 120వ సంవత్సరంలో తొలిసారిగా మొగిలిలో శివాలయం వెలసినట్లు, ఆ తరువాత చోళరాజులు ఈ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వీరితో పాటు అనేక మంది చక్రవర్తులు శ్రీమొగిలీశ్వరుడిని సేవించి తరించారని చరిత్ర తెలుపుతుంది.

మహిమగల దైవం

సంతానం లేని స్త్రీలు ఆలయంలో నిద్ర చేస్తే సంతాన ప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. బిడ్డలులేని ఎందరో మహిళలు స్వామివారి కృపా కటాక్షాలతో మాతృమూర్తులయ్యారు. అందుకే కాబోలు ఆ చుట్టుపక్కల గ్రామాల్లోనే కాకుండా తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మొగిలీశ్వరస్వామి పేరున్న వ్యక్తులు అనేక మంది కనిపిస్తుంటారు. ఈ క్షేత్రంలో వివాహం చేసుకుంటే మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. అందుకే ప్రతి సంవత్సరం వంద వరకు వివాహాలు జరుగుతుంటాయి. ప్రతి అమావాస్యకు భక్తులు ఆలయానికి పోటెత్తుతారు.

బ్రహ్మోత్సవాలు

ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా మొగిలీశ్వరస్వామి దేవస్థానంలో 11 రోజుల పాటు అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు నభూతో నభవిష్యత్ అన్న రీతిలో జరుగుతాయి. ఉభయదారుల చేతులమీదుగా మొగిలీశ్వరస్వామి, కామాక్షమ్మ వివిధ వాహనాలపై కొలువుదీర్చి ఉత్సవాలు నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు పెద్దసంఖ్యలో ప్రజలు మొగిలికి తరలివస్తారు.

ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రం

దేశంలో ప్రసిద్ధి చెందిన శైవక్షేత్రాల్లో మొగిలి శివాలయం ఒకటి. ఇక్కడ మొగిలీశ్వరస్వామి స్వయంభుగా వెలిసి భక్తుల నీరాజనాలు అందుకుంటున్నారు. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. వరపడితే తప్పకుండా సంతాన ప్రాప్తికలుగుతుందన్న నమ్మకంతో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు వస్తుంటారు. స్వామి వారి వారివార్షిక బ్రహ్మోత్సవాలు కూడా వైభవంగా జరుగుతాయి.

– రెడ్డెప్పగురుకుల్, ఆలయ ప్రధాన అర్చకులు, మొగిలి



అర్హులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ కార్యదర్శి నాగరాజన్

చిత్తూరు కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం అర్హులకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ డిమాండ్ చేశారు. చిత్తూరులో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల స్థలం కేటాయిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థికసాయం ఇస్తామని హామీనిచ్చారన్నారు. ఈ నెల 10న అర్హులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు విన్నవించనున్నారు. ఆ రోజు బాధితులు అర్జీలతో చిత్తూరులోని తహసీల్దార్ కార్యాలయానికి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు మణి, విజయగౌరి, రమాదేవి, సత్యమూర్తి, విజయ్ కుమార్, బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ ఆవిష్కరణ



ఏపీటీఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న డీఈవో వరలక్ష్మి

చిత్తూరు కలెక్టరేట్: ఏపీటీఎఫ్ సంఘ నాయకులు ముద్రించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లను డీఈవో వరలక్ష్మి శనివారం ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు గోపినాథ్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో నెలకొన్న టీచర్ల సమస్యలు పరిష్కరించాలని కోరారు. యాప్‌ల పేరుతో ఉన్న పని భారాన్ని తగ్గించాలన్నారు. అనంతరం పలు అంశాలపై డీఈవోతో చర్చించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్తియార్, నాయకులు అఫ్జల్, జగదీష్, మధు, వేణు, ఇబ్రహీం పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాలకు చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ, జెడ్పీటీసీ

పూతలపట్టు(కాణిపాకం): మహిళలు ఆర్థికంగా పురోగాభివృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పూతలపట్టులోని శనివారం ఎంపీడీవో కార్యాలయంలో డ్వాక్రా సంఘాల మహిళలకు పలు రకాల చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో 94 సంఘాలకు రూ.15.70 కోట్లు, 90 మంది మహిళలకు స్త్రీనిధి ద్వారా రూ.4.6 లక్షల రుణాలు ఇస్తున్నారని చెప్పారు. ఈ రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డీసీఎం హరికృష్ణ రెడ్డి, శ్రీనిధి జిల్లా మేనేజర్ ప్రకాష్, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ దేవిక తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారు.

ఫోర్జరీ సంతకంపై ఫిర్యాదుకు సిద్ధం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు అర్బన్ తహసీల్దార్ సంతకం ఫోర్జరీపై తహసీల్దార్ కళావతి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమయ్యారు. ఆగని ఫోర్జరీ దందా శీర్షికన సాక్షి దినపత్రికలో శనివారం వార్తా కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ స్పందించి, సబ్ రిజిస్ట్రార్‌ను ఫోన్‌లో సంప్రదించారు. ఆ ఒరిజినల్ డాక్యుమెంట్లను పంపించాలని కోరారు. ఈ పత్రాల ఆధారంగా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీని వెనుక ముఠాపై కేసు పెట్టే యోచనలో ఉన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

గుడిపాల: క్షేత్ర స్థాయిలో భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. వసంతాపురం సచివాలయంలో శనివారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎవరికైనా దీర్ఘకాలికంగా భూములకు సంబంధించి సమస్య ఉన్నట్లయితే పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వసంతాపురం సర్పంచ్ రజినీకాంత్, ఆర్ఐ రమాసాయి, వీఆర్‌ఓ శ్రీనాథ్‌రెడ్డి, విలేజ్ సర్వేయర్ భానుప్రకాష్, మాజీ సర్పంచ్ రెడ్డెప్ప పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

చీకటి బతుకుల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ







తవణంపల్లె: దివ్యాంగులకు బహుమతులు, యాదమరి: బహుమతుల ప్రదానం, బంగారుపాళెం: అంధ విద్యార్థి రేవతికి బహుమతి ప్రదానం

బంగారుపాళెం: చీకటి బతుకుల్లో వెలుగు రేఖలు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని మండల విద్యాశాఖాధికారి నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రన్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. బ్రెయిలీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ, బ్రెయిలీ అసాధారణ ప్రతిభ, సామర్థ్యాలు గల వ్యక్తిగా రాణించాడన్నారు. అప్పటికీ అమలులో ఉన్న 'లైన్‌టైపు' పద్ధతిలో చదువుకుని 17ఏళ్ల వయసులోనే తాను చదివిన పాఠశాలకు ప్రొఫెసరు అయ్యాడని తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో విద్యను అభ్యసించిన అంధురాలు రేవతి డిగ్రీ, కంప్యూటర్ విద్యను పూర్తి చేయడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు ధనుంజయరాజు, అమూల్య సహిత విద్య ఉపాధ్యాయురాలు హిమబిందు, మీరయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రెయిలీ జయంతి

యాదమరి (కాణిపాకం): యాదమరి మండలంలోని భవిత కేంద్రంలో శనివారం లూయిస్ బ్రెయిలీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎంఈవో రుక్మిణీ, ప్రసాద్, ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజాక్, భవిత కేంద్ర సిబ్బంది, ఉపాధ్యాయులు మహేష్, ఉమ, మధు లూయిస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భవిత కేంద్రంలోని దివ్యాంగులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు.

అంధులకు మార్గదర్శకం బ్రెయిలీ

గుడిపాల: బ్రెయిలీ లిపీ అంధులకు మార్గదర్శకమని, అంధులు ఆత్మస్థైర్యం అలవర్చుకోవాలని మండల విద్యాశాఖాధికారులు హసన్ బాషా, గణపతి తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో శనివారం బ్రెయిలీ జయంతిని నిర్వహించారు. అనంతరం ఆటలపోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖాతున్‌బీ, సహిత ఉపాధ్యాయులు వాణి, బబిత, సీఆర్‌పీలు మల్లికార్జున్, వెంకటేష్ పాల్గొన్నారు.

భవిత కేంద్రంలో..

తవణంపల్లె: స్థానిక హైస్కూల్లోని భవిత కేంద్రంలో బ్రెయిలీకి నివాళులర్పించారు. దివ్యాంగుల పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి హెచ్‌ఎం దేవరాజులు రెడ్డి ఐఈఆర్‌టీ ఉపాధ్యాయులు దేవేంద్ర, దిలీప్, స్పెషల్ ఎడ్యుకేటర్ నాగభూషణం, ఉపాధ్యాయులు విజయకృష్ణారెడ్డి, లవణ్‌కుమార్ పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే ఉద్యోగావకాశాలు



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న చైర్మన్ శ్రీధర్

చిత్తూరు కలెక్టరేట్: నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు మెరుగ్గా ఉంటేనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని విజ్ఞాన సుధ కళాశాల చైర్మన్ శ్రీధర్ తెలిపారు. నగరంలోని కుమార్ నగర్ కాలనీలో ఉన్న ఆ కళాశాలలో శనివారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి యువత నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకోవాలని సూచించారు. నైపుణ్యాభివృద్ధి ఉంటే సులువుగా మెరుగైన ఉద్యోగ అవకాశాలు పొందవచ్చన్నారు. ఈ ఉద్యోగ మేళాలో 10 ఎంఎన్‌సీ కంపెనీలకు 127 మంది తమ కళాశాల విద్యార్థులు ఎంపికవ్వడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పలు కంపెనీల నిర్వాహకులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామీణులకు ముంగిట్లో వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ముంగిట్లో వైద్యం అందుతోందని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పేరయ్యగారిపల్లెలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 65 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని చెప్పారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.